
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



అటవీశాఖ అనుమతిస్తే..
గుండాల–రంగాపురం మధ్య రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా అటవీ శాఖ అనుమతి లేక పనులు జరగడం లేదు. 8లో



హింసించి చంపుతున్నారు
అశ్వారావుపేటలో కుక్కల పట్టివేత పేరుతో వాటి మెడకు ఉచ్చు బిగించి, కొట్టి చంపగా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 24°

వాతావరణం
జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీ మంగళగౌరీ దేవిగా పెద్దమ్మతల్లి



మంగళగౌరీదేవి అలంకరణలో అమ్మవారు

పాల్వంచరూరల్: శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లి అమ్మవారు మంగళవారం శ్రీ మంగళ గౌరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య, రజ, తమో గుణముల కలయిక అయిన స్త్రీ మూర్తులకు మాంగళ్య భాగ్యాన్ని కల్పించే కరుణామూర్తి మంగళగౌరీ దేవి అని ఈ సందర్భంగా అర్చకులు వివరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

'ప్రసాద్' పనుల పరిశీలన



దాతకు రశీదు అందిస్తున్న ఈఓ

భద్రాచలం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రసాద్ పథకం కింద భద్రాచలంలో జరుగుతున్న పనులను శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం ఈఓ కొల్లు దామోదర్‌రావు మంగళవారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు.

గోశాల అభివృద్ధికి విరాళం
దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే గోశాల అభివృద్ధికి హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన అల్లు వెంకట ఫణి కిరణ్ రూ.1,01,116 ఆలయ ఈఓకు అందించగా, ఆయన దాతలకు రశీదు ఇచ్చారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ఐపీహెచ్‌ఎస్ బృందం



ఆసుపత్రిని పరిశీలిస్తున్న హరికృష్ణ తదితరులు

పాల్వంచ: పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఇండియన్ పబ్లిక్ హెల్త్ సొసైటీ బృందం మంగళవారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఐపీహెచ్‌ఎస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరికృష్ణ పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలు, వార్డులు, పనిచేస్తున్న సిబ్బంది హాజరుశాతం, తాగునీటి సౌకర్యం, లేబర్ రూం తదితర సుమారు 78 అంశాలను పరిశీలించారు. ఆస్పత్రిలో ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అందుతున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐపీహెచ్‌ఎస్ సభ్యులు రవి, ఆశిష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్‌ఎంఓ సోమరాజు దొర తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రాల్లో తరగతులు బోధించడానికి కౌన్సిలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలలోని అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ బి.వీరన్న తెలిపారు. సంబంధిత పీజీలో 55శాతం మార్కులతో పాటు బోధన అనుభవం, పీహెచ్‌డీ నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్నవారు www. braou online. in వెబ్‌సైట్‌లో అక్టోబర్ 10వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ట్యాంక్‌బండ్ తరహాలో బౌద్ధక్షేత్రం అభివృద్ధి

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలోకెల్లా అతి పెద్దదైన మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎల్.రమేష్ తెలిపారు. ఆయన మంగళవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి బౌద్ధక్షేత్రం, ఆనుకుని ఉన్న చెరువును పరిశీలించి పర్యాటకంగా చేయాల్సిన పనులపై చర్చించారు. ఖమ్మం లోని లకారం ట్యాంక్‌బండ్ మాదిరి బోటింగ్, వాకింగ్ ట్రాక్, జిమ్, చిల్డ్రన్ పార్క్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై ఆరాతీశారు. ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు, జేఈలు మదీనా, రుత్విక్‌తో పాటు పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లే పూల కొట్లు!

కొత్తగూడెంలో అండర్ బ్రిడ్జి దగ్గర ఫుట్‌పాత్‌పై విక్రయిస్తున్న పూలు



పండగ వచ్చిందంటే చాలు.. జిల్లాలోని అన్ని పట్టణాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. పర్వదినాల్లో భగవంతుడిని పూజించేందుకు ఉపయోగించే సామగ్రి అమ్మేందుకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పుర, నగరపాలికలు విఫలం అవుతున్నాయి.
– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పూజా సామగ్రి అమ్మకాలూ ఇక్కడే
- జిల్లా వ్యాప్తంగా రోడ్ల పక్కనే క్రయవిక్రయాలు
- ఇబ్బంది పడుతున్న చిరువ్యాపారులు, వాహనదారులు
- పండగ వస్తే పట్టణాల్లో తప్పని ట్రాఫిక్ చిక్కులు

ప్రతి నెలా పండగే..
జనవరిలో వచ్చే సంక్రాంతి మొదలు డిసెంబర్ 31 అర్ధరాత్రి నిర్వహించే న్యూఇయర్ వేడుకల వరకు ప్రతీ నెల కనీసం ఒక్క పండగైనా వస్తుంది. ఈ సందర్భంగా ఆయా దేవతలను ఆరాధించేందుకు ప్రతిమలు, పూజా సామగ్రి, బొమ్మలు, దీపాలు, పూలు తదితర వస్తువులు అవసరం. ఇవన్నీ సాధారణ మార్కెట్‌లో నిత్యం లభించేవి కావు. అప్పటికప్పుడు చిరు వ్యాపారులు ఈ వస్తువులను సేకరించి ప్రజలకు అందుబాటులోకి తెస్తుంటారు. అయితే ఈ క్రయవిక్రయాలు జరిపేందుకు వీలుగా అనువైన స్థలం చూపించడం, అక్కడ కనీస వసతులు కల్పించడంపై జిల్లాలోని స్థానిక సంస్థలు దృష్టి పెట్టడం లేదు. ఇల్లెందు, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట వంటి పట్టణాలతో పాటు కొత్తగూడెం కార్పొరేషన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

జిల్లా కేంద్రంలో మరీ దారుణం..
పండగలు, ఇతర ఉత్సవాల సమయంలో జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో బస్టాండ్ – రైల్వేస్టేషన్ మధ్య ప్రధాన రహదారికి ఇరువైపులా చిరువ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. బతుకమ్మ పండగ వస్తే పూలు, దీపావళికి బొమ్మలు, వినాయకచవితి రోజున గరిక, వెలగపండ్లు, శివరాత్రి సమయంలో కందమూలాలు, నూతన సంవత్సరం సందర్భంగా కేక్‌లు ఇక్కడే విక్రయిస్తుంటారు. 500 మీటర్ల నిడివి గల ఈ రోడ్డు 'ఎస్' ఆకారంలో ఒంపుతో ఉంటుంది. పైగా అండర్ బ్రిడ్జి కూడా ఉంది. ఇలాంటి ఒంపులు తిరిగిన రోడ్ల వద్ద వాహనాలు ఆపకూడదు. కానీ చిరువ్యాపారులు ఫుట్‌పాత్‌లనే అడ్డాలుగా చేసుకుని అమ్మకాలు సాగిస్తుండగా కొనుగోలుదారులు అక్కడే వాహనాలు ఆపుతున్నారు. ఫలితంగా ప్రతీ పండగ సమయంలో ఇక్కడ ఇక్కట్లు తప్పడం లేదు.

దీపావళి తరహాలో..
దీపావళి పండగ సమయంలో బాణసంచా అమ్మేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంటారు. ఏదైనా స్థలంలో షెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు పార్కింగ్ సౌకర్యం ఉండేలా చూస్తారు. జిల్లాలోని ప్రతీ మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన మార్కెట్‌కు సమీపంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. ఇక్కడ మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి. కానీ ఇప్పటికీ పూర్తి కాలేదు. కనీసం ఇలాంటి స్థలాల దగ్గరైనా పర్వదినాల్లో ఉపయోగించే వస్తువులు అమ్మకాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ఇలా చేయడంతో ఇటు చిరువ్యాపారులతో పాటు అటు భక్తులు, పట్టణవాసులకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

ఇతర పట్టణాల్లోనూ ఇవే ఇబ్బందులు..
కొత్తగూడెం కార్పొరేషన్ తరహాలో అశ్వారావుపేట, ఇల్లెందు, మణుగూరు పురపాలికలు, భద్రాచలం వంటి టెంపుల్ టౌన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీలపై నిర్మించిన ఫుట్‌పాత్‌లే పూజా సామగ్రి క్రయ విక్రయ కేంద్రాలుగా నిలుస్తున్నాయి. మరోవైపు ఇక్కడ అమ్మకాలు సాగించేందుకు పల్లెల నుంచి చిరువ్యాపారులు కుటుంబ సమేతంగా వస్తుంటారు. అర్ధరాత్రి నుంచే ఫుట్‌పాత్‌లపై కవర్లు వేసుకుని స్థలాలు ఆపుతుంటారు. రాత్రంతా అక్కడే ఉండే వ్యాపారులు, మహిళలు, బాలికలు తమ కనీస అవసరాలకు చాటు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ నెల ఈ తతంతగం జరుగుతున్నా పరిష్కారం చూపించే నాథుడు లేడు.

ఇబ్బందిగా ఉంది



పండగ రోజు తెల్లవారు జామునే వచ్చినా పూలు అమ్మేందుకు రోడ్డు పక్కన స్థలం దొరకదు. అందుకే ముందు రోజు రాత్రే వచ్చి ఇక్కడ ఫుట్‌పాత్‌పై జాగ చూసుకోవాలి. రాత్రంతా రోడ్ల పక్కనే ఉండడం ఇబ్బందిగా ఉంది.
– కృష్ణవేణి, వ్యాపారి, సుజాతనగర్

మార్కెట్ కావాలి



రోడ్ల పక్కన బండి ఆపి పూజా సామగ్రి కొనే సమయంలో కస్టమర్లు ఇబ్బంది పడుతున్నారు. మంచి నాణ్యమైన వస్తువులు మా దగ్గర ఉన్నా, ట్రాఫిక్ ఇబ్బంది కారణంగా ఏదో ఒక వస్తువు కొనుక్కుని వెళ్తున్నారు. పార్కింగ్ సౌకర్యం ఉన్న చోట అమ్మకాలకు అవకాశం కల్పిస్తే అందరికీ బాగుంటుంది.
– గణేశ్, వ్యాపారి, రాఘవాపురం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం





చిత్రకూట మండపంలో పారాయణం చేస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) ఆదిలక్ష్మి అలంకరణలో అమ్మవారు

- తొలిరోజు ఆదిలక్ష్మి అలంకరణలో దర్శనం
- నేడు సంతానలక్ష్మిగా లక్ష్మీతాయారమ్మవారు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజున లక్ష్మీతాయారమ్మవారు ఆదిలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చతుర్భుజాలతో పై రెండు చేతుల్లో పద్మాలను ధరించి వరద – అభయ హస్తాలతో ఉన్న ఆదిలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శించుకుని తరించారు. మధ్యాహ్నం సామూహిక కుంకుమార్చన నిర్వహించగా పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు. కాగా, ఉదయం చిత్రకూట మండపంలో అర్చకులు శ్రీరామాయణ పారాయణ మహోత్సవాలు నిర్వహించారు. తొలిరోజు బాలకాండ పారాయణం గావించారు. అనంతరం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై కొలువు దీర్చి హారతి, నివేదన సమర్పించారు. శ్రీరామ పారాయణానికి స్వచ్ఛందంగా వచ్చిన భక్తులకు, పండితులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పించారు.

నేడు సంతానలక్ష్మిగా దర్శనం..
'అఖిల జగన్మాతరం, అస్మన్మాతరం' అంటూ సర్వం కీర్తించే సంతానలక్ష్మిగా లక్ష్మీతాయారు అమ్మవారు బుధవారం దర్శనం ఇవ్వనున్నారు. సకల చరాచర జగత్తు ఆ అమ్మ సంతానమని, అందుకే ఆమె సంతానలక్ష్మి అని, ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే సంతాన అవరోధాలు తొలగుతాయని పండితులు తెలిపారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం..
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చిన అర్చకులు.. మొదట విశ్వక్సేన పూజ, పుణ్యావాచం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న ఐజీ విపుల్‌కుమార్

చర్ల: మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న సీఆర్‌పీఎఫ్ 81వ బెటాలియన్‌కు సంబంధించి సీఆర్‌పీఎఫ్ ఐజీ విపుల్‌కుమార్ మంగళవారం స్థల పరిశీలన చేశారు. చర్లలోని సర్వే నంబర్ 117లో బెటాలియన్ ఏర్పాటుకు గతంలో పదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించగా.. తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ నుంచి స్థల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ.. బెటాలియన్ ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉందని, త్వరలోనే ఇంజనీరింగ్ అధికారులతో పర్యవేక్షించి నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. ఈ ప్రాంతంలో భద్రతా పరమైన అంశాలపై భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్‌తో చర్చించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ సత్యనారాయణపురం కమాండెంట్ ముకేష్‌కుమార్, చర్ల సీఐ రాజువర్మ, ఎస్సైలు, నర్సిరెడ్డి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో పారదర్శకత ఉండాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 1,72,937 ఎకరాల్లో పత్తిసాగు చేశారని, 26,54,140 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారని చెప్పారు. ఈ సంవత్సరం పత్తి మద్దతు ధర రూ 8,110 ప్రభుత్వం నిర్ణయించిదని తెలిపారు. పత్తి కొనుగోళ్లకు ఆరు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేశామని, తూకంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అన్నారు. జిల్లాలో ఉన్న వే బ్రిడ్జిలను తనిఖీ చేయాలని తూనికలు, కొలతల శాఖాధికారిని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, వసతి, గోదాములు, తేమ పరీక్షించే యంత్రాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పత్తి తీసిన తర్వాత తోటల్లోని కట్టెను బయోచార్ తయారీకి ఉపయోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని మిల్లర్లకు సూచించారు. సమావేశంలో సీపీఓ సంజీవరావు, డీఏఓ బాబూరావు, మార్కెటింగ్ అధికారి నరేందర్, తూనికలు, కొలతల అధికారి మనోహర్, ఆర్టీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి
మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. డ్రగ్స్‌తో కలిగే నష్టాలపై విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వాటికి బానిసైన వారిని గుర్తించి చికిత్స, కౌన్సిలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని, డీ అడిక్షన్ సెంటర్ ద్వారా అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. అటవీ శాఖాధికారులు తమ పరిధిలో గంజాయి సాగు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆస్పత్రులు, మెడికల్ షాపుల్లో తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. రక్తదానంపై యువతకు అవగాహన కల్పించి రక్తదాన శిబిరాలు, అనీమియా పరీక్షలు నిర్వహించాలని, నర్సింగ్, ఎన్‌సీసీ శిక్షణ ద్వారా యువతకు మార్గనిర్దేశం చేయాలని అన్నారు. సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, డీఐఈఓ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు

వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ



బతుకమ్మలతో వేణుగోపాల్, సౌరభ్ శర్మ, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/చుంచుపల్లి: బతుకమ్మ సంబరాల్లో మూడో రోజైన మంగళవారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ హాజరై మహిళా ఉద్యోగులతో కలిసి ఆడి, పాడారు. సంప్రదాయం ప్రకారం చామంతి, మందార, సీతమ్మజడ, రామబాణం వంటి పూలతో మూడంతరాల్లో బతుకమ్మను పేర్చి తామరపాత్రలో కళాత్మకంగా అలంకరించారు. మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పూజించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని అన్నారు. ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ మాట్లాడుతూ.. ఇలాంటి పండుగలు ఉద్యోగుల మధ్య సఖ్యత, సామరస్య వాతావరణాన్ని పెంచుతాయని అన్నారు. వేడుకల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా, వైద్యశాఖ సిబ్బంది, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

'డ్వాక్రా' డబ్బు మాయం..

- చేతివాటం ప్రదర్శించిన బుక్ కీపర్
- మహిళా సంఘాలకు చెందిన రూ.7లక్షలు సొంత అవసరాలకు..
- ఐకేపీలో వెలుగులోకి వస్తున్న వరుస అక్రమాలు

బూర్గంపాడు: ఇందిరా క్రాంతి పథంలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఆరు నెలల క్రితం స్త్రీ నిధి రుణాలను పెద్ద మొత్తంలో సీసీ కాజేసిన వ్యవహారం కొలిక్కి రాకముందే వరుస అక్రమాలు బయట పడుతున్నాయి. ఎస్‌హెచ్‌జీ సభ్యులు బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాలను సారపాకకు చెందిన బుక్ కీపర్ పెద్ద మొత్తంలో స్వాహా చేసినట్లు సోమవారం ఆరోపణలు వచ్చాయి. ఓ ఎస్‌హెచ్‌జీ సభ్యులు 9 నెలలుగా చెల్లించిన పొదుపు, బ్యాంకు రుణాలకు సంబంధించిన నగదును బ్యాంకుకు చెల్లించకుండా తన సొంత అవసరాలకు వాడుకున్నట్లు తేలింది. 9 నెలలుగా గ్రూప్ సభ్యులు పొదుపు, లోన్ డబ్బులు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు గ్రూప్ లీడర్‌ను ప్రశ్నించగా.. తాము క్రమం తప్పకుండా పొదుపు, రుణం చెల్లిస్తున్నామని తెలిపారు. దీంతో రికార్డులు పరిశీలించాక బుక్ కీపర్‌ను గ్రూప్ సభ్యులు నిలదీయగా అసలు విషయం తేలింది. ఆమెకు ఇచ్చిన రూ. 5.96 లక్షలతో పాటు మరో గ్రూప్ సభ్యులు చెల్లించిన రూ 1.25లక్షల పొదుపు నగదును కూడా సొంతానికి వాడుకున్నట్లు వెల్లడైంది. దీంతో గ్రూప్ సభ్యులు ఆమె ఇంటికి వెళ్లి ప్రశ్నించగా సభ్యులతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఐకేపీ ఏపీఎం హేమంతిని మంగళవారం బుక్ కీపర్‌ను, గ్రూప్ సభ్యులను కార్యాలయానికి పిలిచి విచారించగా రూ. 7లక్షలకు పైగా నగదును తన సొంత అవసరాలకు వాడుకున్నట్లు అంగీకరించింది. కొంత సమయం ఇస్తే ఆ నగదు తిరిగి చెల్లిస్తానని సభ్యులకు ఒప్పంద పత్రం రాసిచ్చింది. ఈ బుక్ కీపర్ పరిధిలోని మిగతా గ్రూప్ సభ్యులు కూడా తమ బ్యాంకు లావాదేవీలను మంగళవారం పరిశీలించుకున్నారు. కొన్ని గ్రూపులకు చెందిన నగదు చెల్లింపుల్లో కూడా ఆమె బాగానే చేతివాటం ప్రదర్శించినట్లు చర్చ సాగుతోంది. మొత్తంగా రూ.60 లక్షల వరకు బుక్ కీపర్ తన సొంత అవసరాలకు వాడుకున్నట్లు ప్రచారం సాగుతుండగా ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ చేసి వాస్తవాలను వెలికితీస్తామని ఏపీఎం హేమంతిని తెలిపారు.


డ్వాక్రా సభ్యుల్లో ఆందోళన..
బూర్గంపాడు ఐకేపీ కార్యాలయంలో వరుసగా అక్రమాలు వెలుగు చూస్తుండటంతో డ్వాక్రా సంఘాల సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ఆరు నెలల క్రితం ఓ సీసీ స్త్రీనిధి రుణాల రికవరీలో భారీగా అవినీతికి పాల్పడ్డాడు. కృష్ణసాగర్, లక్ష్మీపురం, నకిరిపేట, సారపాక గ్రామాలకు చెందిన గ్రూపుల నుంచి స్త్రీ నిధి రుణాల రికవరీకి సంబంధించి రూ. 45 లక్షల వరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. సదరు సీసీని సస్పెండ్ చేసి నగదు రికవరీకి ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే ఈ వ్యవహారంలో సీసీని సస్పెండ్ చేసిన అధికారులు.. రికవరీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ఘటన మరువక ముందే బూర్గంపాడులోని గౌతమీపురానికి చెందిన డ్వాక్రా గ్రూపులకు ఇచ్చిన స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లోనూ అక్రమాలు జరిగాయని బాధితులు ఐకేపీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ వ్యవహారంపై కూడా కలెక్టర్ విచారణకు ఆదేశించి, నివేదికలను అందించాలని సెర్ప్ అధికారులకు సూచించారు. ఇంతలోనే సారపాకలో బుక్ కీపర్ చేతివాటం బయటపడింది. బ్యాంకులో తీసుకునే రుణాలకు కూడా బుక్ కీపర్‌లు, సీసీలు గ్రూప్ సభ్యుల నుంచి భారీగానే డబ్బు వసూలు చేస్తున్నారనే ప్రచారం సాగుతున్నా.. వివరాలు వెల్లడించేందుకు సభ్యులు భయపడుతున్నారు. బూర్గంపాడు ఐకేపీ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై డీఆర్‌డీఏ, సెర్ప్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాలని సభ్యులు కోరుతున్నారు.



బూర్గంపాడులోని ఐకేపీ కార్యాలయం

కిన్నెరసాని నాలుగు గేట్లు ఎత్తివేత

గోదావరిలోకి 20 వేల క్యూసెక్కుల నీరు విడుదల




కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న నీరు

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి పెరుగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో నీటిమట్టం మంగళవారం 405.70 అడుగులకు పెరిగింది. దీంతో రాత్రి సమయంలో నాలుగు గేట్లు ఎత్తి 20 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాల కట్టడిపై దృష్టి

సిబ్బందికి ఎస్పీ ఆదేశం

దుమ్ముగూడెం/ బూర్గంపాడు : కోడిపందేలు, పేకాట ,బెట్టింగుల వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ రోహిత్ రాజు సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన దుమ్ముగూడెం, బూర్గంపాడు పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాల కదలికలపై నిఘా పెంచాలని, చోరీల కట్టడికి కృషి చేయాలని చెప్పారు. అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా ప్రజలను భాగస్వాములను చేస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లలో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరగాళ్ల మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను అక్రమంగా రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.



దుమ్ముగూడెంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

క్లుప్తంగా

సైబర్ కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: సైబర్ నేరగాళ్ల వలలో పడి ఓ వ్యక్తి నగదు కోల్పోగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లోని భద్రాద్రి వాటర్ ప్లాంట్‌లో రమేశ్‌బాబు మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఓ వ్యక్తి ఫోన్ చేసి.. తాము పట్టణంలో మిలిటరీ క్యాంటీన్‌ను నడుపుతున్నామని, రోజుకు 30 వాటర్ క్యాన్లు అవసరం ఉంటుందని చెప్పి ఫోన్ పే లేదా గూగుల్ పే ఉన్న నంబర్ చెబితే రూ.7.5 వేలు పంపిస్తామని చెప్పారు. కొద్దిసేపటి తరువాత మళ్లీ ఫోన్ చేసి, రూ.7.5 వేలకు బదులు అనుకోకుండా రూ.87.50 వేలు పంపించామని, అడ్వాన్స్ నగదు ఉంచుకుని మిగిలిన నగదును పంపించాలని చెప్పారు. ముందుగా రమేశ్‌బాబు రూ.30 వేలు ఫోన్ పే చేశాడు. మిగిలిన నగదు కూడా వారి ఖాతాలో జమ చేసేందుకు బ్యాంకుకు వెళ్లగా తన ఖాతాలో డబ్బులు కనిపించలేదు. వెంటనే బాధితుడు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక లారీలు సీజ్



సీజ్ చేసిన ఇసుక లారీలు

దమ్మపేట: ఆంధ్ర నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను దమ్మపేట పోలీసులు మంగళవారం తెల్లవారుజామున సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నాగుపల్లి శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఏపీ నుంచి అనుమతులు లేకుండా వస్తున్న రెండు ఇసుక లారీలను గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ..

ఒకరు మృతి

కొత్తగూడెంటౌన్: రెండు ద్విచక్రవాహనదారులు ఒకదానికొకటి ఢీకొనడంతో చంద్రగొండకు చెందిన ఎండీ సాజిద్ (38) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం రుద్రంపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చంద్రుగొండ నుంచి కొత్తగూడెంనకు ఎండీ సాజిత్ తన ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. మరో ద్విచక్రవాహనంపై దంపతులు వెళ్తున్నారు. రాత్రి వర్షం కురుస్తుండటంతో రుద్రంపూర్‌లోని జీఎం కార్యాలయం సమీపంలోని మూలమలుపు వద్ద ఒకరి ద్విచక్ర వాహనాన్ని మరొకరు ఢీకొట్టారు. దీంతో ఎండీ సాజిత్ తీవ్రంగా గాయపడగా.. దంపతులు స్వల్పంగా గాయపడ్డారు. సీఐ ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తగూడెంలోని జిల్లా ప్రధానాస్పత్రికి తరలించారు. సాజిత్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రతాప్ తెలిపారు.

బాప్‌రే.. మొక్కజొన్న 20 అడుగులు!



సహజంగా మొక్కజొన్న మొక్కలు ఐదు అడుగులు అంతకు కాస్త ఎక్కువగా ఎత్తు పెరుగుతాయి. కానీ నేలకొండపల్లి లోని స్వాతంత్ర సమర యోధుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వున్నం వెంకయ్య నివాసంలో మొక్కజొన్న చెట్టు దాదాపు 20 అడుగుల మేర పెరిగింది. వెంకయ్య భార్య, మాజీ ఎంపీటీసీ వున్నం స్వరాజ్యం మొక్కజొన్న పిలక నాటి సంరక్షించడంతో ఏపుగా పెరిగిందని తెలిపారు.

– నేలకొండపల్లి

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

అటవీశాఖ అనుమతిస్తే..

- గుండాల నుంచి రంగాపురానికి నులువైన ప్రయాణం
- ఐదేళ్ల క్రితం రోడ్డు పనులకు మంజూరైన నిధులు..
- అనుమతులు రాక నిలిచిపోయిన పనులు
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న పలుగ్రామాల ప్రజలు



సాయనపల్లి - రంగాపురం మధ్య కోతకు గురవుతున్న రోడ్డు

గుండాల: జిల్లాలోని గుండాల –రంగాపురం మధ్య రోడ్డు పరిస్థితి దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని విధంగా ఉంది. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా అటవీశాఖ అనుమతి లేక పనులు జరగడం లేదు. కొంతమేర మాత్రమే రోడ్డు వేసి గ్రామాల మధ్య పనులను నిలిపివేశారు. దీంతో వర్షాకాలంలో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ రోడ్డు పూర్తయితే అటు మణుగూరుతో పాటు మేడారం జాతర సమయంలో ఎంతో ఉపయోగపడనుంది. భారీ వర్షాల కారణంగా రోడ్డు కోతకు గురవుతుందని, గుంతలు ఏర్పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.24 కోట్లు మంజూరు

గుండాల – రంగాపురం మధ్య 28 కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మించేందుకు ఐదేళ్ల క్రితం నక్సల్స్ ప్రభావిత ప్రాంత అభివృద్ధి కింద రూ.24 కోట్లు మంజూరు చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ గుండాల నుంచి సాయనపల్లి వరకు బీటీ రోడ్డు వేయగా అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. మధ్యలో ఉన్న వాగులపై బ్రిడ్జి పనులు సైతం పూర్తి చేశారు. అటవీశాఖ అనుమతుల కోసం పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మణుగూరు నుంచి గుండాలకు బస్సు సౌకర్యం ఉన్నా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో సాయనపల్లి, దామరతోగు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మేడారం జాతరకు కీలకం

మేడారంలో జరిగే సమ్మక్క – సారలమ్మ జాతరకు గుండాల మీదుగా రాకపోకలు సాగుతున్నాయి. ఇల్లెందు, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ తదితర ప్రాంతాల నుంచి గుండాల మీదుగా వాహనాలు వెళ్తుంటాయి. ఖమ్మం, ఇల్లెందు నుంచి ఆర్టీసీ బస్సులు సైతం నడిపిస్తున్నారు. ప్రస్తుతం గుండాల – పస్రా మీదుగా ప్రయాణం సాగిస్తున్నారు. అయితే, గుండాల – రంగాపురం మధ్య రోడ్డు పనులు పూర్తయితే తాడ్వాయి మీదుగా మేడారం చేరేందుకు రద్దీలేని ప్రయాణం అవుతుంది. మేడారం జాతర సమయంలో వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది.

వర్షాకాలంలో తప్పని తిప్పలు

సాయనపల్లి – రంగాపురం మధ్య రోడ్డంతా అధ్వానంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపడుతున్నా ఫలితం ఉండడం లేదు. భారీ వర్షాలకు రోడ్డంతా కోతకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. డబుల్ రోడ్డు కాకపోయినా సింగిల్ రోడ్డు నిర్మాణమైనా చేపట్టాలని వేడుకుంటున్నారు. సాయనపల్లి, మల్లెలగుంపు, వెంకటాపురం, దామరతోగు, తక్కెళ్ల గూడెం, గణాపురం గ్రామాల గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. పనుల నిమిత్తం నియోజకవర్గ ఎమ్మెల్యే వద్దకు వెళ్లాలన్నా ఈ రోడ్డే ఆధారం. పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఉపయోగం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అనుమతి వస్తే పనులు చేపడుతాం

గుండాల – రంగాపురం మధ్య రహదారి నిర్మాణానికి నిధులు మంజూరై ఏళ్లు గడుస్తోంది. అటవీశాఖ నుంచి అనుమాలు రావాల్సి ఉంది. ఇప్పటికే పలుమార్లు అనుమతుల కోసం విన్నవించాం. అనుమతులు రాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తాం. నిధులు ఉన్నా ఫలితం లేకుండా పోతోంది.

–మోతీలాల్, ఏఈ ఆర్అండ్‌బీ

పనిమీద వెళ్లాలంటే అవస్థలు



పనుల నిమిత్తం మణుగూరు వెళ్తుంటాం. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బస్సు సర్వీసులు నిలిచిపోతే ప్రైవేట్ వాహనాలు తిరగవు. వైద్యం పొందాలన్నా మణుగూరు లేదా గుండాల రావాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తిచేసి, అందుబాటులోకి తీసురావాలి. –వాగబోయిన కృష్ణ, రంగాపురం

రోడ్డు నిర్మిస్తే మేలు



ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా ఫారెస్టు అనుమతులు రావడం లేదు.నిధులు వచ్చినా ఉపయోగం లేదు. ఈ రోడ్డు పనులు పూర్తయితే మేడారం వెళ్లేందుకు చాలా ఉపయోగంగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారింది. –తోలెం సాంబయ్య, రంగాపురం

నకిలీ పాస్‌పుస్తకాల కలకలం



వివిధ ప్రాంతాల రైతుల పేరిట రూపొందించిన నకిలీ పాస్‌పుస్తకాలు

- రాష్ట్రంలో వివిధ ప్రాంతాల రైతులకు టోకరా
- రెవెన్యూ మంత్రికి అందిన ఫిర్యాదుతో కదిలిన డొంక
- ఐదుగురితో కూడిన ముఠా అరెస్ట్

కూసుమంచి: సమస్యల్లో ఉన్న భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పిస్తామంటూ రూ.లక్షల మేర వసూలు చేసి నకిలీ పుస్తకాలు అంటగట్టిన ముఠా వ్యవహారం బట్టబయలైంది. ఖమ్మం జిల్లా కూసుమంచి పోలీసులు చేపట్టిన దర్యాప్తులో ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి 10 నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. వీరి చేతిలో రాష్ట్రంలోని నల్లగొండ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, సంగారెడ్డి ప్రాంతాల రైతులు మోసపోగా.. బాధితుల లెక్క తేలాల్సి ఉంది.

ఆన్‌లైన్‌లో లేకపోవడంతో...

కూసుమంచి మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన కళ్లెం అంజిరెడ్డిని అదే గ్రామానికి చెందిన, ముఠాలో ఒకరైన కొత్తా జీవన్‌రెడ్డి సంప్రదించాడు. మూడెకరాల భూమికి తనకు తెలిసిన వారి ద్వారా పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పిస్తానంటూ రూ.13 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అంజిరెడ్డి విడతల వారీగా రూ.5లక్షలు చెల్లించినా పాసుపుస్తకం ఇవ్వకపోగా మిగిలిన డబ్బు కావాలని ఒత్తిడి చేస్తుండడంతో అనుమానించాడు. ఆపై వాట్సాప్‌లో ఓ పాస్‌పుస్తకం పంపించాడు. ఆ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే లేకపోవడంతో అనుమానం బలపడగా అంజిరెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో తీవ్రంగా పరిగణించిన ఆయన సమగ్ర విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. దీంతో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యాన సీఐ సంజీవ్, ఎస్సై నాగరాజు రంగంలోకి దిగారు. ఈక్రమాన రెండు కార్లలో బుధవారం ఉదయం జీవన్‌రెడ్డితో పాటు మహబూబాబాద్ జిల్లా గార్ల బయ్యారానికి చెందిన కొండూరి కార్తీక్(ప్రస్తుతం ఖమ్మంలో నివాసం), భద్రాద్రి జిల్లా పాల్వంచకు చెందిన పారిపత్తి సాయికుశల్, లక్ష్మీదేవిపల్లికి చెందిన జక్కపల్లి వరప్రసాద్, ఖమ్మం బొక్కలగడ్డకు చెందిన నందమూరి లక్ష్మణ్‌రావు(ప్రస్తుతం సారపాకలో నివాసం) వెళ్తుండగా అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. దీంతోనకిలీ పాస్‌పుస్తకాలు తయారు చేస్తున్నట్లు ఒప్పుకోగా 10 పాస్ పుస్తకాలను, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరైన లక్ష్మణ్ తన ప్రింటింగ్ ప్రెస్‌లోనే పాస్‌పుస్తకాలు తయారుచేసినట్లు అంగీకరించారని కూసుమంచి ఎస్సై నాగరాజు తెలిపారు. ఈ ముఠా చేతిలో ఎందరు రైతులు మోసపోయారో తేల్చేందుకు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రైతుల సమస్యలే ఆసరాగా..

వివాదాస్పద భూములతో పాటు వివిధ కారణాలతో పట్టాదారు పాస్ పుస్తకాలు లేక ఇబ్బంది పడుతున్న రైతులను గుర్తించి ఈ ముఠా సంప్రదించడం మొదలుపెట్టింది. వీరికి పాసు పుస్తకాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.లక్షల చొప్పున మొత్తం రూ.కోట్లలో వసూలు చేశారు. భూముల ధర రూ.లక్షల్లో ఉండడంతో రైతులు కూడా ముఠా అడిగినంత డబ్బు ముట్టజెప్పారు. కూసుమంచి మండలంతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ముఠా సభ్యులు ఎవరికి వారు తమకు పరిచయం ఉన్న రైతుల నుంచి డబ్బు లాగేశారు. డబ్బు తీసుకుని ముఖం చాటేయడంతో రైతుల నుంచి ఒత్తిడి ఎదురైంది. దీంతో నకిలీ పుస్తకాల తయారీకి శ్రీకారం చుట్టారు. ప్రింటింగ్ ప్రెస్‌లో పుస్తకాలు తయారుచేసి, కలర్ ప్రింటర్ సాయంతో రైతుల ఫొటోలు, పేర్లు ముద్రించడమే కాక ప్రభుత్వ హాలోగ్రామ్ వేసి రైతులకు అప్పగించారు.

ఆవు కళ్ల ముందే లేగదూడ మృతి

దూడ పైనుంచి కారు వెళ్లడంతో ప్రమాదం



లేగ దూడను లేపేందుకు ప్రయత్నిస్తున్న తల్లి ఆవు

భద్రాచలంఅర్బన్: తల్లి ప్రేమ మనుషులకే కాదు మూగజీవాలకూ ఉంటుందని నిరూపితమైన ఘటన భద్రాచలంలో మంగళవారం చోటుచేసుకుంది. పట్టణంలోని యూబీ రోడ్డులోని జంక్షన్‌లో నిద్రిస్తున్న లేగదూడ పైనుంచి ప్రమాదవశాత్తు ఓ కారు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. అక్కడే ఉన్న తల్లి ఆవు గమనించి లేగదూడ చుట్టూ తిరుగుతూ లేపేందుకు తీవ్రంగా యత్నించింది. ఆగ్రహంతో స్థానికులెవరినీ అక్కడికి రానివ్వలేదు. ఎంతసేపు అరిచినా లేగదూడ లేవకపోవడంతో అక్కడే నిలబడి దీనంగా చూస్తుఉండిపోయింది. అనంతరం జంతు ప్రేమికుడు ఉదయ్‌కుమార్.. స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. కాగా, లేగదూడను ఉదయ్‌కుమార్ తన ఫోన్‌తో వీడియో తీస్తుండగానే ఈ ఘటన జరగడం గమనార్హం. పశు వైద్యులు లేగదూడకు పోస్టుమార్టం నిర్వహించగా, గోదావరి సమీపంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా ఈ ఘటనలో వాహన యజమానిపై కేసు నమోదు చేసినట్టు సీఐ నాగరాజు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

చంద్రుగొండ: మండలంలోని గానుగపాడు గ్రామానికి చెందిన వ్యక్తి మొగలిపువ్వు నాగరాజు (44) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన నాగరాజుతో పాటు అతడి స్నేహితుడు ఎల్లయ్య సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై సుజాతనగర్ నుంచి గానుగపాడుకు వస్తున్నారు. మార్గమధ్యలో అన్నరంతండా వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వారిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నాగరాజు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

నేలకొండపల్లి: ఎక్కడకు వెళ్లినా కలిసిమెలిసి తిరిగే ఇద్దరు స్నేహితులకు మృత్యువు కూడా విడదీయలేకపోయింది. చీకటి, వర్షం కారణంగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తుండగా.. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రగాయాలతో మృత్యువాత పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంకు చెందిన డిగ్రీ విద్యార్థి బచ్చలకూరి మనోజ్‌కుమార్(18), మెకానిక్ సన్నీ ప్రసాద్(17) ఇద్దరు స్నేహితులు. వీరు మంగళవారం రాత్రి బైక్‌పై నేలకొండపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఇటుక బట్టీల సమీపాన ఎదురుగా మరో బైక్ వస్తుండడంతో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో మనోజ్, ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే సనరికి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే, జోరు వాన, చీకటిగా ఉండడంతో ఎదురుగా బైక్‌పై వస్తున్న వారికి కనిపించక ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, మృతులిద్దరూ ఒకే గ్రామస్తులు, స్నేహితులు కావడంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.



మనోజ్‌కుమార్, ప్రసాద్ (ఫైల్)

గ్రామాలు అభివృద్ధి సాధించేలా..

'ఆది కర్మయోగి అభియాన్' ప్రారంభం



గ్రామస్తులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న పీఓ రాహుల్, అధికారులు

దుమ్ముగూడెం: మారుమూల ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారానికి ఆది కర్మయోగి అభియాన్ పథకం ప్రవేశపెట్టామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. మంగళవారం మండలంలోని సింగవరం, నడికుడి గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆది సేవ కేంద్రం ప్రారంభించి అధికారులు, గ్రామస్తులతో కలిసి మౌలిక వసతుల కల్పనపై ఢిల్లీ నుంచి వచ్చిన పర్యవేక్షకులు ప్రదీప్‌కుమార్‌సింగ్‌తో కలిసి పీఓ చర్చించారు. 2030 వచ్చేసరికి పథకంలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని, అందుకు ప్రతి గ్రామంలో వలంటీర్, సహాయోగులను నియమించారని, వారు ప్రతి శనివారం సమస్యలపై చర్చించి, ప్రతిపాదనలు తయారు చేస్తారన్నారు. చివరి శనివారం అధికారుల సమక్షంలో ప్రతిపాదనలు అందజేస్తారని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో ఉద్దీపకం వర్క్ బుక్ ప్రవేశపెట్టారని, 10వ తరగతి పాస్ అయిన విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్ ప్రవేశపెట్టామని వెల్లడించారు. అనంతరం సింగవరం, నడికుడి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు వివరించారు. ప్రదీప్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ.. ఈ పథకం కింద అన్ని శాఖల అధికారులు గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఢిల్లీకి పంపించి నిధులు తెప్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్, స్పెషల్ ఆఫీసర్ అశోక్‌కుమార్, ఎంపీఓ రామకృష్ణ, డీఎంటీలు రాంబాబు, మధువన్, జగదీశ్, డీఎంహెచ్‌ఓ సైదులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య, సీడీపీఓ జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ తదితరులు పాల్గొన్నారు.తొలుత, పీఓ, పర్యవేక్షకులు రాహుల్, ప్రదీప్‌కుమార్‌సింగ్‌కు మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆటపాటలతో స్వాగతం పలికారు.

అమ్మవారికి పీఓ రాహుల్ పూజలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం శాంతినగర్ కాలనీలోని శ్రీ లలిత పరమేశ్వరి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఐటీడీఏ పీఓ రాహుల్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రెండో రోజైన మంగళవారం శ్రీగాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ మల్చింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హేమంత్‌కుమార్

అశ్వారావుపేట: వ్యవసాయ వ్యర్థాలతో ఆర్గానిక్ మల్చింగ్ విధానంపై అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం కళాశాలలోని గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ఆవరణలోని ఆయిల్‌పాం తోటలో వ్యర్థాలు, తెగిన మట్టలను ష్రెడర్, మల్చింగ్ యంత్రాల్లో పొడిగా మలిచి నేల కనిపించకుండా పరిచారు. ప్లాస్టిక్ మల్చింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఆర్గానిక్ మల్చింగ్ చేయడంతో కలిగే ప్రయోజనాలు, సంపద ఎలా సృష్టించాలో విద్యార్థులకు హేమంత్‌కుమార్ వివరించారు. గ్రీన్ క్లబ్ నిర్వాహకులు డాక్టర్ నీలిమ తెలంగాణలో ఆయిల్‌పాం విస్తీర్ణం, సాగు, మట్టలతో మల్చింగ్‌తో పాటు నేలకు పోషకాలు అందుతాయని తెలిపారు. వ్యర్థాలను ఉపయోగించి విలువైన పదార్థాల తయారీకి ముందుకు వచ్చే స్టార్టప్ కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల బోధనా సిబ్బంది రాంప్రసాద్, రవికుమార్, శ్రీనివాస్, దీపికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా క్రికెట్ జట్టుకు తాటిగూడెం బాలిక

అండర్ – 15 ప్రాబబుల్ టీమ్‌కు ఎంపిక



రామటెంకి దేవీ ప్రియ

కరకగూడెం: అండర్ –15 రాష్ట్ర స్థాయి మహిళా క్రికెట్ జట్టుకు మండలంలోని తాటిగూడెం గ్రామానికి చెందిన రామటెంకి దేవీప్రియ ఎంపికైంది. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక.. క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి అండర్ –15 మహిళా క్రికెట్ ప్రాబబుల్ జట్టులో సభ్యురాలిగా ఎంపికైంది. ఆమె తండ్రి హనుమంతరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. దేవీప్రియకు క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని గమనించిన హనుమంతరావు శిక్షణ ఇప్పించారు. కాగా, ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించిన ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్‌లో 600 మంది క్రీడాకారిణుల మధ్య ప్రతిభ చాటిన దేవీప్రియ రాష్ట్ర ప్రాబబుల్ జట్టులో చోటు దక్కించుకుంది. ఈ సందర్భంగా హెడ్ కోచ్ సురేందర్ రెడ్డి, కోచ్‌లు వెంకట్ యాదవ్, బుచ్చిబాబు, రంజీ కోచ్ ఇర్ఫాన్ తదితరులు బాలికను అభినందించారు.

వైఎస్సార్ నగర్‌లో దొంగల హల్‌చల్

ఎనిమిది మంది ముఠా.. ఆరు ఇళ్లలో చోరీ



చోరీ చేస్తున్న నిందితులు (సీసీ టీవీ ఫుటేజీ)

ఖమ్మం అర్బన్: ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లో సోమవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ముసుగులు ధరించి వచ్చిన ఎనిమిది మంది ముఠా కాలనీలోని ఆరు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. స్థానికులు వసంతబాయి, రుక్మిణి లేకపోవడంతో వారి ఇళ్ల తాళాలు పగలగొట్టి బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను ఎత్తుకెళ్లినట్టు సమాచారం. దొంగల కదలికలు సీసీ కెమెరాల్లో కూడా రికార్డు అయ్యాయి. అంతేకాక ఒక బెల్ట్ షాప్‌లో జొరబడి నగదు చోరీ చేయడంతో పాటు మద్యం తాగినట్లు సమాచారం. ఈక్రమాన ఒక మహిళ అడ్డుకునే ప్రయత్నం చేస్తే సెల్‌ఫోన్ లాక్కుని, మరో ఇద్దరిపై దాడి చేసినట్లు తెలిసింది. ఈ విషయమై అందిన సమాచారంతో మంగళవారం ఉదయం ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్, సిబ్బందితో చేరుకుని విచారణ చేపట్టారు. అయితే, చోరీల వెనుక స్థానిక యువకులే ఉన్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే మాదిరి గత నెలలోనూ మధురనగర్ ప్రాంతంలో ముసుగులు ధరించిన వ్యక్తులు చోరీ చేశారు. ఈమేరకు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హింసించి చంపుతున్నారు..

- కుక్కల కట్టడి పేరుతో హింస
- సహకరిస్తున్న మున్సిపాలిటీలు.. పంచాయతీలు



కుక్కమెడకు తాడు కట్టి వ్యాన్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

అశ్వారావుపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో మంగళవారం ఉదయం ఓ కుక్క మరణాన్ని చూసిన వారికి 'కుక్క చావు'అంటే ఇలా ఉంటుందా? అని అనిపించకమానదు. బైండింగ్ వైర్‌తో ఉచ్చు వేసి, ఆహార పదార్థం అమర్చి, కుక్క నోటితో పట్టుకోగానే ఉచ్చును బిగించారు. తర్వాత బిగుసుకుపోయిన కుక్కను వ్యాన్‌లోకి విసిరే క్రమంలో పలుమార్లు వ్యాన్‌డోర్‌కు తగిలి కింద పడి విలవిల్లాడుతూ చనిపోయిన ఆ జీవులను చూసి పలువురు అయ్యో పాపం అనుకున్నారు తప్ప చేసేదేమీ లేకుండా పోయింది. సాధారణంగా అడవిలో వణ్యమృగాలను వేటాడేందుకు వేట కుక్కలుంటాయి. మేకల కాపరులు, వేటగాళ్లు ఈ వేటకుక్కలను పెంచుతుంటారు. కానీ, అశ్వారావుపేటలో కుక్కలను వేటాడే వేటగాళ్లొచ్చి పడ్డారని ప్రజలు అనుకుంటున్నారు.

ఎందుకిదంత..?

ఒక్కో కుక్కను పట్టుకున్నందుకు ప్రాంతాన్ని బట్టి అవసరాన్ని బట్టి ధర నిర్ణయిస్తారు. గతంలో ఒక్కో కుక్కకు రూ.500 చెల్లించి పట్టించారు. ఒక పంచాయతీలో పట్టుకున్న కుక్కలను దూరంగా మరో పంచాయతీ సరిహద్దులో వదిలేస్తారు. మళ్లీ ఇదే పట్టుబడి ముఠాకు చెందిన మరో బృందం పక్కనున్న పంచాయతీలో ఇవే కుక్కలను పట్టుకుంటుంటారు. ఈ క్రమంలో వారం క్రితం ఇతర ప్రాంతం నుంచి అశ్వారావుపేటకు తెచ్చి కొన్ని కుక్కలను, కోతులను విడిచిపెడుతుంటే స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అశ్వారావుపేటలో రాజమండ్రికి చెందిన కొందరు వేటగాళ్లు కుక్కలను వేటాడుతున్నారు. కానీ, జనావాసాల్లో కుక్కలను నియంత్రించాలంటే ముందుగా వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయాలి తప్ప ఎలాంటి హింసకు గురిచేయొద్దని పలువురు చెబుతున్నారు. మున్సిపాలిటీ / పంచాయతీ ఖర్చుతో స్థానిక ప్రభుత్వ పశుసంవర్థక శాఖ వైద్యాధికారితో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించాలి. ఆపరేషన్ అనంతరం చెవికి ట్యాగ్ తగిలించి ఎక్కడ పట్టుకున్నారో అదే స్థానంలో కుక్కను విడిచిపెట్టాలి. అంతేకానీ హింసించడం.. కిడ్నాప్ చేయడం.. అక్రమ రవాణా చేయడం తగదని జంతు ప్రేమికులు చెబుతున్నారు. కుక్కలతో స్థానికులకు ఇబ్బందులున్న మాట వాస్తవమే కానీ.. వాటినీ సాటి ప్రాణుల్లా చూస్తూ స్థానిక ప్రజానికాన్ని నిబంధనల ప్రకారం కాపాడాల్సిన అవసరం మున్సిపాలిటీ అధికారులపై ఉంది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ బి.నాగరాజు దృష్టికి తీసుకువెళ్లగా.. కుక్కలను పట్టమని చెప్పాం తప్ప హింసించడం సరైన పద్ధతి కాదని చెప్పారు. కుక్కలను పట్టే ప్రక్రియను తాత్కాలికంగా ఉపసంహరిస్తామని, కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసేలా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు.